@netifocusnews @focustv

http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక


ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శుక్రవారం 09, ఆగస్ట్ 2024 || పేజీలు: 04




## ద్రవ్య పరపతి విధానం యథాతథం

- రెపోరేటులో మార్పు లేదన్న ఆర్‌బిఐ
- యూపీఐ చెల్లింపుల్లో 5లక్షల వరకు అనుమతి
- వివరాలు వెల్లడించిన గవర్నర్ శక్తికాంత్ దాస్

2



## బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత

కోల్‌కతా, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 08:

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు శిఖరం బుద్ధదేవ్ భట్టాచార్జీ (80) తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా శ్వాసకోస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన.. కోల్‌కతాలోని మిగతా 2లో..

## బీజేపీతో బంధమా? విలీనమా?




### కేసీఆర్ అడుగులు హస్తినవైపు పడేనా? బీఆర్ఎస్, బీజేపీల మైత్రిపై తీవ్ర చర్చ

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 08:

**పదేళ్లపాటు అధికారం అనుభవించి,** ఆర్థికంగా బలపడి, ఇష్టారాజ్యంగా పాలన చేసిన బిఆర్ఎస్‌కు ప్రస్తుత పరిస్థితులు మింగుడు పడడం లేదు. వరుసగా మూడోసారి అధికారం తమదే అనుకున్న తరుణంలో పరిస్థితులు తలకిందులయ్యాయి. ఈ ఉక్కపోతను కెసిఆర్ కుటంబం భరించకోలేక పోతున్నది. ఓ వైపు విచారణ, మరోవైపు విమర్శలు, ఇంకోవైపు కూతురు కవిత జైలకు వెళ్లడం వంటి విషయాలు కెసిఆర్‌ను పుండులాగా సలుపుతున్నాయి. అందుకే దీనిని నుంచి బయటపడే మార్గాల గురించి ఆలోచన చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ప్రధానంగా రేవంత్ సిఎం కావడాన్ని బిఆర్ఎస్ తట్టుకోలేక పోతోంది.ఈ క్రమంలో దీనికి చెక్ పెట్టాలన్న ఆలోచన నుంచే బిజెపికి చేరువ కావాలన్న సూత్రం పుట్టిందన్న ప్రచారం సాగుతోంది. ప్రధానంగా రెండు విషయాలపై బిఆర్ఎస్‌లో అంతర్గతంగా చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. మిగతా 2లో..




## పెట్టుబడులే లక్ష్యం



### అగ్రరాజ్యంలో పెట్టుబడుల వేట

- సిఎం రేవంత్ చర్చలు ఫలవంతం
- పలు కంపెనీలు పెట్టుబడులకు సిద్ధం
- ఒప్పందాలన్నీ ఖచ్చితంగా తెలంగాణ అభివృద్ధి కోసమే..
- నిరాధార వార్తలపై ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ వివరణ

2

- అమెరికాలో కొనసాగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- కాగ్నిజెంట్, చార్లెస్ స్వాబ్ తదితర సంస్థలకు స్వాగతం
- బిజీ బిజీగా గడుపుతున్న రేవంత్‌రెడ్డి
- పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా ఒప్పందాలు
- డల్లాస్ చేరుకున్న సిఎం బృందం
- మహాత్ముడి విగ్రహానికి నివాళులు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 08:

**సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు పెట్టుబడులు** రాబట్టడమే లక్ష్యంగా అమెరికాలో వివిధ బహుళజాతి సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఈ నెల 3న అమెరికా వెళ్లిన సీఎం ఇప్పటి వరకు ఐదు రోజుల వ్యవధిలో 10సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఈ క్రమంలో టెక్సాస్ చేరుకున్న సిఎం బృందం డల్లాస్‌లో మహాత్ముడి విగ్రహం వద్ద మిగతా 2లో..





## మేడిగడ్డ, సుంకిశాల పాపం బీఆర్ఎస్‌దే

- లోపభూయిష్టంగా ప్రాజెక్టుల నిర్మాణం
- విద్యుత్ ఉన్నతాధికారులతో భట్టి సమీక్ష
- నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 08:

మేడిగడ్డ ప్రాజెక్టుతోపాటు సుంకిశాల పాపం కూడా గత భారాస పాలకులదే నని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆరోపించారు. ఆ నెపం వేరొకరి మీద వేయడం దారుణమని మిగతా 2లో..

## జీఎస్టీ కుంభకోణం సీఐడీ దూకుడు



- మాజీ సిఎస్ సోమేశ్ కుమార్ తదితరులకు నోటీసులు
- రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 08:

జిఎస్టీ కుంభకోణంలో సిఐడి అధికారులు దూకుడు పెంచారు. జిఎస్‌టి కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ సిఎస్ సోమేశ్ కుమార్‌తో పాటు ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరికి నోటీసులు ఇచ్చేందుకు సిఐడి అధికారులు సిద్ధమవుతున్నారు. కొద్ది రోజుల్లోనే వీరికి నోటీసులు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. మొదట ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు చేపట్టారు. కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఈ కేసును సిఐడికి అప్పగించింది. సిసిఎస్ నుంచి ఎఫ్ఐఆర్ ఆధారంగా కేసు నమోదు చేసిన సిఐడి అధికారులు దర్యాప్తును ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సిఐడి మిగతా 2లో..



## వయనాడ్‌లో 417కు చేరిన మృతుల సంఖ్య

- శనివారం వరద ప్రాంతాల్లో ప్రధాని మోదీ పర్యటన

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 08:

ప్రకృతి సృష్టించిన బీభత్సంతో కేరళలో వయనాడ్ జిల్లా ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. ఆయినా వర్ష భయం మాత్రం వున్నాడుతూనే ఉంది. ఈ క్రమంలో బాధిత ప్రజలను ఓదార్చి, విలయాన్ని నేరుగా చూడాలని ప్రధాని మోడీ నిర్ణయించారు. మిగతా 2లో..

## వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంట్‌లో రగడ

- వ్యతిరేకించిన ఇండియా కూటమి
- అంగీకరించేది లేదన్న ఎంఐఎం
- జెసిసికి పంపుతున్నట్లు మంత్రి కిరణ్ రిజు వెల్లడి

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 08:

వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు తెచ్చే దిశగా రూపొందించిన సవరణ బిల్లు గురువారం లోక్‌సభ ముందుకొచ్చింది. దీనిపై విపక్షాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. మిగతా 2లో..

# పెట్టుబడులే లక్ష్యం





(మొదటి పేజీ తరువాయి..)

నివాళి అర్పించింది. పూలమాలలు వేసిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీదర్ బాబు, కోమటిరెడ్డిలు శ్రద్ధాంజలి ఘటించారు. ఇక ఒప్పందాల్లో భాగంగా కాగ్నిజెంట్ సంస్థ త్వరలో హైదరాబాద్ లో అతిపెద్ద క్యాంపస్ ను ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపింది. ఈ సంస్థ క్యాంపస్ ఏర్పాటు అయితే 15 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. వాల్ష్ కార్రా హోల్డింగ్స్ సంస్థ వీ?హబ్ లో ఐదు మిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టేందుకు అంగీకారం తెలిపింది. తెలంగాణ స్టార్టప్?లలో 100 మిలియన్ల పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొంది. అదే విధంగా ఆర్సీసియం సంస్థతోనూ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ ద్వారా దాదాపు 500 హై? ఎండ్ టెక్ ఉద్యోగాలు లభిస్తాయి. స్వచ్ఛ్ బయో సంస్థ వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటిచింది. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా ఐదు వందల మందికి కొలువులు రానున్నాయి. మరో సంస్థ ట్రైజిన్ టెక్నాలజీస్ హైదరాబాద్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్ డెవెలప్మెంట్, డెలివరీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపింది. ఈ సంస్థ ఏర్పాటు ద్వారా దాదాపు 1000 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయి. హెచ్సీఏ హెల్త్ కేర్ నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్ విస్తరించేందుకు అంగీకారం తెలిపింది. గ్లాస్ ట్యూబింగ్ ఫెసిలిటీ కేంద్రంలో వచ్చే ఏడాది వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించనున్నట్టు కార్నింగ్ సంస్థ వెల్లడించింది. వీవీంట్ పార్మా 400 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్టు తెలిపింది. ఈ సంస్థ ద్వారా వెయ్యి మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. చా÷-లర్గ÷స్ స్వాబ్ హైదరాబాద్ లో భారతదేశంలోనే మొదటి టెక్నాలజీ డెవెలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ఇవాళ ప్రకటించింది. ఈ సంస్థ ఇండియాలో ఎంచుకున్న మొట్టమొదటి నగరం హైదరాబాద్ కావడం విశేషం. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం అయ్యేందుకు వరల్డ్ బ్యాంకు సంసిద్ధంతను ప్రకటించింది.

## మేడిగడ్డ, సుంకిశాల పాపం
# బీఆర్ఎస్‌దే

(మొదటి పేజీ తరువాయి..)

విమర్శించారు. నాసికరమైన కట్టడం, డిజైన్ లోపం కారణంగానే 2021లో భారాస హయాంలో చేపట్టిన సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిందన్నారు. భారాస కాలం నాటి ప్రాజెక్టు డిజైన్లు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆరోపించారు. కూలిపోయే గోడలు కట్టి.. మరొకరిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వర్షాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో భట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుంకిశాలపై వార్తల్లో తప్పుడు ప్రచారం జరుగుతోందని చెప్పారు. మేడిగడ్డ గోదావరి నదిపై మాత్రమే కాదని, కృష్ణానదిని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలిపెట్టలేదని చెప్పారు. సుంకిశాలను బీఆర్ఎస్ నిర్మించిందని చెప్పారు. డిజైన్ లోపం వల్ల సుంకిశాల కూలిందని.. దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సుంకిశాల కట్టింది తాము కాదని గత ప్రభుత్వం కట్టిందేనని స్పష్టం చేశారు. గోదావరి మేడిగడ్డతో పాటు సుంకిశాల పాపం కేసీఆర్ ప్రభుత్వానిదేనని తేల్చిచెప్పారు. 2021లో మొదలు 2023 జూలైలో సుంకిశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ పాపాలను తమపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని అయ్యారు. పాపాలను భరించలేక ఇప్పటికే ప్రజలు కేసీఆర్ ప్రభుత్వనికి బుద్ధి చెప్పారని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పదోన్నతులపై ఉద్యోగులతో చర్చిస్తామని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ అధికారులకు భట్టి విక్రమార్క అదేశించారు. వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అంతర్జాతీయ పెట్టుబడులను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరాపై దిశానిర్దేశం చేశారు. ఎస్పీడీసీఎల్‌లో అంతర్గత బదిలీలు, ప్రమోషన్లపై కూడా ఆదేశాలు జారీ చేశామని అన్నారు. విద్యుత్ సరఫరాకు ఏదైనా ఇబ్బంది అయితే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల కోసమే నిరంతరం ఎస్పీడీసీఎల్ పనిచేస్తోందని మర్చిపోవద్దని అన్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంట్‌లో రగడ

(మొదటి పేజీ తరువాయి..)

దీంతో బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీని పంపుతామని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కిరణ్ రిజిజు గురువారం దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై సభలో చర్చ ప్రారంభించారు. ఈ సందర్భంగా విపక్ష నేతలు మాట్లాడుతూ కేంద్రంపై ధ్వజమెత్తారు. ఈ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, మతపరమైన విభజనకు దారితీస్తుందని కాంగ్రెస్ దీన్ని ఖండించింది. ముస్లింల హక్కుల్ని లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని తాము అంగీకరించేదే లేదని విపక్ష నేతలు భగ్గుమన్నారు. అయితే, విపక్షాల ఆరోపణలను కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. సచార్ కమిటీ నివేదిక మేరకు బిల్లును రూపొందించాం. బిల్లుపై దేశవ్యాప్తంగా సంప్రదింపులు జరిపాం. దీని వల్ల మతపరమైన స్వేచ్ఛకు ఆటంకం ఉండదు. ఇతరుల హక్కులను హరిస్తుందనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఇప్పటివరకు హక్కులు పొందని వారికి దీంతో ప్రయోజనం చేకూరుతుంది. వక్ఫ్ బోర్డులను మాఫియా ఆక్రమించిందని చాలా మంది ఎంపీలు చెప్పారు. కొందరు ఎంపీలు వ్యక్తిగతంగా ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కొన్ని పార్టీలు సిద్దాంతపరంగా మద్దతు ఇవ్వలేమని చెప్పాయి. వక్ఫ్ బోర్డులో వివిధ మతాల సభ్యులుండాలని మేం చెప్పట్లేదు. పార్లమెంట్ సభ్యుడు మాత్రం బోర్డులో ఉండాలంటున్నాం అని కేంద్ర మంత్రి వివరించారు. అయితే, విపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నట్లు రిజిజు వెల్లడించారు. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసే విధంగా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈ మేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. కొత్త బిల్లు అమలులోకి వస్తే జిల్లా కలెక్టర్లు రూపొందించిన వాస్తవ అంచనా విలువల మేర వక్ఫ్ బోర్డులు తమ ఆస్తులను తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. భాజపా సర్కారు ఎప్పట్నుంచో ఈ సవరణల గురించి ఆలోచిస్తోందని, ఇది సరైన నిర్ణయం కాదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇదివరకే ఈ బిల్లును వ్యతిరేకించింది. ఈ క్రమంలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై పార్లమెంట్ లో చర్చ సందర్భంగా రచ్చ రచ్చ అయింది. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రతిపక్ష ఇండియా కూటమి వ్యతిరేకించింది. వక్ఫ్ బోర్డులో కేంద్రం జోక్యంపై ఎంఐఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేంద్రం చేసిన సవరణలను ఇండియా కూటమి సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు.

# బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య

(మొదటి పేజీ తరువాయి..)

తన నివాసంలో కన్నుమూశారు. గతేడాది న్యుమోనియా సోకడంపాటు పలు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో తరుచూ ఆస్పత్రికి వెళ్లి వస్తుండేవారు. అయితే గురువారం నాడు ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు లోనైన బుద్ధదేవ్ మృతిచెందారు. పెద్దాయన ఇకలేరన్న వార్తతో కుటుంబ సభ్యులు, అభిమానులు, సీపీఎం కార్యకర్తలు, నేతలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కాగా.. భట్టాచార్జీకి భార్య మీరా, కుమారుడు సుచేతన్ ఉన్నారు. మార్చి1, 1944న బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన బుద్ధదేవ్.. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో ఉన్నత చదువులు చదివారు. బెంగాల్ సాహిత్యం చదివిన ఆయన.. ఉపాధ్యాయుడిగా కెరీర్ మొదలుపెట్టారు. ఇక ప్రజాసేవే లక్ష్యంగా 1966 రాజకీయాల్లోకి వచ్చి.. పలు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1968లో జరిగిన వియత్నాం ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. ఈ క్రమంలోనే.. 1968లో యువజన విభాగం అయిన డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రమోద్ దాస్‌గుప్తా.. బుద్ధదేవ్‌కు గురువు అని చెప్పుకుంటూ ఉంటారు. 1977లో కాశీపూర్-బెల్గాచియా నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. మొదటిసారే గెలవడమే కాదు.. సమాచార శాఖా మంత్రిగా పదవి కూడా దక్కించుకున్నారు. 1982లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోసిపూర్ నియోజకవర్గం నుంచి 1982లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత.. 1984లో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1987లో జాదవ్‌పూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈసారి కూడా.. మొదటిసారి మాదిరిగానే సమాచార శాఖ మంత్రిగా పనిచేశారు. 1991లో సమాచార శాఖతో పాటు సాంస్కృతిక వ్యవహారాలు, పట్టణాభివృద్ధి, మునిసిపల్ వ్యవహారాల శాఖలకు మంత్రిగా తన కర్తవ్యాలను నిర్వర్తించారు. అలా పార్టీకి విధేయుడిగా ఉండటంతో పాటు.. పోటీచేసిన నియోజకవర్గానికే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈయనపైన అవినీతి ఆరోపణలున్నాయని అప్పట్లో పెద్ద చర్చే జరిగింది.

# జీఎస్టీ కుంభకోణం.. సీఐడీ దూకుడు

(మొదటి పేజీ తరువాయి..)

అధికారులకు కీలక సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం మేరకే మాజీ సిఎస్ సోమేశ్ కుమార్ సహా నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్వీస్ టాక్స్ అదనపు కమిషనర్ ఎస్వి కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరామ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్ బాబు, ప్లియాంటో టెక్నాలజీస్ కంపెనీ నిర్వాహకులకు నోటీసులు అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. స్పెషల్ ఇనిషియేటివ్స్ వాట్సాప్ గ్రూపు ద్వారా సోమేశ్ కుమార్ సర్వీస్ టాక్స్ అధికారులు విశ్వేశ్వరరావు, శివరామ ప్రసాద్, శోభన్ బాబులకు ఆదేశాలు ఇచ్చినట్లు సిఐడి అధికారులు ఆధారాలను సేకరించినట్లు చెబుతున్నారు. కమర్షియల్ టాక్స్ సెంట్రల్ కంప్యూటర్ వింగ్ జాయింట్ డైరెక్టర్ రవి కనూరి అందించిన ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా దర్యాప్తును సిఐడి అధికారులు చేపట్టారు. ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ చెల్లింపుల్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ సహా 75 కంపెనీలకు లబ్ధి చేసినట్లు ఆధారాలను సేకరించారు. ఈ కుంభకోణంతో ప్రభుత్వ ఖజానాకు సుమారు 1000 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు సిఐడి అధికారులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. సిఐడి దర్యాప్తు ముమ్మరం అయితే కీలక అంశాలు వెలు గులోకి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ కేసును సిఐడి అధికారులు ప్రత్యేకంగా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తెలంగాణ ప్రభు త్వం కూడా ఈ కేసుపై సీరియస్ గానే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దలు ఈ కేసు విషయంలో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసు కుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లేలా చేశారని ప్రభుత్వం భావించిన నేపథ్యంలోనే దీనిపై విచారణ చేపట్టింది. వీలైనంత వేగంగా విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్న నేపథ్యంలో సిఐడి అధికారు లు దూకుడు పెంచారు. కొద్దిరోజుల్లోనే నోటీసులు అందించి వారిని విచారించేందుకు సిఐడి అధికారులు సిద్ధమవుతున్నారు. సదరు అధికారుల ను విచారించిన తర్వాత కీలక అంశాలు బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

# బీజేపీతో బంధమా.. విలీనమా?

(మొదటి పేజీ తరువాయి..)

ఇక్కడ బిఆర్ఎస్ అంటే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు లాంటి వారి మధ్యనే అని గుర్తించాలి. ప్రస్తుత రాజకీయాలను మలుపు తిప్పాలన్నదే వారి ఎత్తుగడగా ఉంది. ఇందులో భాగంగా కేంద్రంతో సఖ్యతగా ఉంటూ కవితను విడిపంచుకోవడం... బిఆర్ఎస్ మద్దతను బిజెపికి తెలపడం. అయితే దీని వల్ల కేవలం కవిత మాత్రమే బయటకు రావచ్చు. కానీ అధికారం దక్కదు. అందుకే ఎన్‌డిఎలో చేరేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఐదుగురిలో కేశవరావు జారుకుని రాజీనామా చేశారు. బిజెపికి కూడా రాజ్యసభలో బలం అవసరం. నలుగురు రావడం అంటే తక్కువేమీ కాదు. అందుకే బిఆర్ఎస్, బిజెపిల విలీనపై ఈ మధ్య పుంఖానుపుంఖాలుగా వార్తలు తన్నుకు వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా బిఆర్ఎస్ విలీనం అయితే కెసిఆర్ కేంద్రమంత్రిగా ఢిల్లీకి వెళ్లడం.. ఒప్పందంగా ఉండొచ్చు. తదుపరి కాలంలో తెలంగాణలోనూ షిండేలను సృష్టించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అన్నది కావచ్చు. ఇవన్నీ కూడా ఊహాజనితమే అయినా ..వీటిచుట్టే ప్రచారం సాగుతోంది. బిఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు కలిశాక వారి బలం ఇప్పుడున్న పరిస్థితుల్లో 36కు చేరుకుంటుంది. ఓ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. వారిని కూడా వెనక్కి రప్పించడం జరగవచ్చు. లేదా కోర్టు ద్వారా ఒకరిద్దరి పై వేటు వేయించి దారికి తెచ్చుకునే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి. అందుకే తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయనే భ్రమను కలిపిస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు జరుగుతున్నాయని విస్తృత ప్రచారం ప్రారంభమయింది. గత నాలుగైదు నెలలుగా ఈ తరహా ప్రచారం అంతర్గతంగా సాగుతోంది. కానీ ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు. ఓ ట్వీట్ ద్వారా వీలైనంత బలంగా విలీనం ప్రచారం కుట్ర పూరిత ప్రచారం అన్నారు కానీ.. ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు. బీఆర్ఎస్ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అందుకే ఎక్కువ మంది విలీన చర్చలు నిజమేనని అనుకుంటున్నారు. గత నెలలో బీఆర్ఎస్‌కి చెందిన ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. కొన్ని కీలక సమావేశాలు ఉన్నప్పటికీ వారు ఢిల్లీలో మకాం వేశారు. వారు ఎవరితో సమావేశమయ్యారో ఎవరికీ తెలియదు. వీరి ఢిల్లీ టూర్‌పై కాంగ్రెస్ పార్టీ సెటైర్లు వేసింది. రేవంత్ రెడ్డి అయితే పార్టీని తాకట్టు పెట్టడానికి వెళ్లారని విమర్శించారు. బీజేపీ నేతల కోసం పడిగాపులు పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పుడు తాజాగా మరోసారి కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. ఒక్క రోజు కొంత సేపు కవితతో తీహార్ జైల్లో ములాఖత్ అయ్యారు. మిగిలిన రోజుల్లో ఏం చేస్తున్నారో .. ఎవరితో సమావేశం అవుతున్నారో స్పష్టత లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లుగా ఓసారి ఫోటో రిలీజ్ చేశారు. అందుకోసం రోజుల తరబడి అక్కడ ఉండాల్సిన అవసరం లేదు. వీరు బీజేపీ పెద్దలతో రహస్యంగా విలీన ప్రతిపాదనపై చర్చలు జరుపుతున్నారన్న బలమైన సమాచారం బయటకు రావడంతో కొంత మంది నేరుగా ఈ విషయాన్ని ప్రచారం చేస్తున్నారు. నిజానికి నిప్పులేనిదే పొగరాదు. ఎక్కడో ఒకచోట్ఏదో ఒక సందర్భం లేకుండా ఇలాంటి వార్తలు రావు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎలాంటి విలీనం చర్చలు జరగకపోతే.. ఈ విషయాన్ని ఖండించడానికి రెండు పార్టీలు ఎందుకు తటపటాయిస్తున్నాయన్నది రాజకీయవర్గాల నుంచి వస్తున్న మొదటి ప్రశ్న. నిర్మోహమాటంగా ఖండించడానికి బీఆర్ఎస్ ముఖ్య నేతలు సిద్దంగా లేరు. కీలక నేతలు ప్రతి రోజూ తెలంగాణ భవన్‌లో ప్రెస్మీట్లు పెడుతున్నారు కానీ.. బీజేపీతో పొత్తు లేదా విలీనం అంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించడానికి నిరాకరిస్తున్నారు. కేటీఆర్ కూడా ఓ ట్వీట్ పెట్టారు కానీ.. బీజేపీతో ఎలాంటి సంబంధాలు ఉండవని ఖచ్చితంగా చెప్పడం లేదు. తెలంగాణ కోసం పోరాడతామని చెబుతున్నారు. నిప్పు లేనిదే పొగ రాదన్నట్లుగా ఢిల్లీలో ఏదో జరుగుతోందని సులువుగా అర్థమైపోతుంది. స్వయంగా మజ్లిస్ పార్టీ చీఫ్ అసుద్దన్ ఓవైసీ కూడా ఈ అంశంపై బీఆర్ఎస్‌ను ప్రశ్నించినా స్పందన లేదు. నిజానికి బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పొత్తు లేదా విలీనం అంశంపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయని బీఆర్ఎస్సే నేరుగా ప్రతిపాదన పెట్టినా.. తెలంగాణ బీజేపీ నేతల్లో ఏకాభిప్రాయం లేకపోవడం వల్లనే డీల్ ఆలస్యమవుతోందని ఢిల్లీ వర్గాలు గట్టిగా చెబుతన్నాయి. బీఆర్ఎస్‌తో తీవ్రంగా పోరాడిన ముగ్గురు ఎంపీలు పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకున్నా సరే అది బీజేపీకి నష్టం చేస్తుందని గట్టిగా వాదిస్తున్నారని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి ఉన్న క్యాడర్ బలం..బీజేపీకి కలసి వస్తుందని.. కింది స్థాయి వరకూ పార్టీ నిర్మాణం ఏర్పడుతుందని.. ఇతర సీనియర్ నేతలు పాజిటివ్‌గా స్పందిస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగానే చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని వ్యతిరేకించే వారిని .. సముదాయించి అధికారిక ప్రకటన చేస్తారని చెబుతున్నారు. అయితే బీఆర్ఎస్ క్యాడర్ మాత్రం.. అలాంటి పరిస్థితి రాదని.. కేసీఆర్ తన పార్టీని ఇతర పార్టీల్లో కలిపేంత నిర్ణయం తీసుకోరని అనుకుంటున్నారు. మొత్తంగా ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే..

## ద్రవ్య పరపతి విధానం
# యథాతథం

ముంబై, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 08:

విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పులు చేర్పులు చేయకుండా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. పరపతి విధాన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు. రెపోరేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి కూడా రెపో రేటును ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగిస్తూ వస్తోంది. ఆర్‌బీఐ బెంచ్‌మార్క్ వడ్డీ రేటును యథాతథంగా కొనసాగించడం ఇది 9వ సారి కావడం గమనార్హం. ద్రవ్యోల్బణం, వృద్ధి అనేవి రెండూ కూడా సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. అయినప్పటికీ ఆహార ధరల విషయమంలో అప్రమత్తత అవసరమని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంపీసీ తొలిసారిగా సమావేశమైంది. మొత్తంగా చూస్తే ఇది 50వ సమావేశం. ఈ సమావేశంలో మానిటరీ పాలసీ కమిటీలోని ఆరుగురిలో నలుగురు పాలసీ రేటును యథాతథంగా ఉంచాలనే నిర్ణయానికి అనుకూలంగా ఓటు వేశారని శక్తికాంత దాస్ చెప్పారు. ముఖ్యంగా.. సెంట్రల్ బ్యాంక్ నుంచి బ్యాంకులు డబ్బు తీసుకునే రేటు. రెపో రేటు స్థిరంగా ఉండటంతో మన రుణ వాయిదాలో ఎలాంటి మార్పులు చేర్పులు ఉండబోవు. రెపో రేటు తగ్గితే మన హోమ్ లోన్, పర్సనల్ లోన్, కార్ లోన్ వాయిదా తగ్గుతుంది. ఆర్‌బీఐ చివరిసారిగా గతేడాది ఫిబ్రవరిలో రెపో రేటును మార్చింది. ఆ తర్వాత 0.25 శాతం పెరిగి 6.50 శాతానికి చేరుకుంది. ఆహార పదార్థాల ధరలు పెరగడంతో ఏప్రిల్ - మే వరకూ స్థిరంగా ఉన్న ద్రవ్యోల్బణం.. జూన్‌లో మళ్లీ పెరిగింది. 2024-25లో వాస్తవ జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతం కాగా.. ఒకటి, రెండు, నాలుగో త్రైమాసికంలో 7.2 శాతం, మూడో క్వార్టర్‌లో 7.3 శాతంగా ఉండే అవకాశం. ఆహార ద్రవ్యోల్బణం అనేది నైరుతి రుతుపవనాల కారణంగా దిగొచ్చే అవకాశం ఉంది. 2024-25లో ద్రవ్యోల్బణం 4.5 శాతం.. రెండో త్రైమాసికంలో 4.4 శాతం.. మూడో త్రైమాసికంలో 4.7శాతం .. నాలుగో త్రైమాసికంలో 4.3 శాతంగా ఉండవచ్చు. భారత కరెన్సీ రూపాయి మారకం విలువ విషయానికి వస్తే.. పరిమిత శ్రేణిలోనే ఉంది. భారత విదేశీ మారక నిల్వలు ఆగస్టు రెండు నాటికి రికార్డ్ స్థాయిలో 675 బిలియన్ డాలర్లకు చేరవచ్చు. రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రత్యామ్నాయ పెట్టుబడి అవకాశాలు ఒకవైపు పెరుగు తుంటే.. బ్యాంకుల డిపాజిట్లు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులు క్రెడిట్ డిమాండ్‌ను అందుకోవ డంలో ఇబ్బంది పడుతున్నాయి. వ్యక్తిగత రుణ వితరణలో గణనీయ వృద్ధిని పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. టాపప్ లోన్లు, బంగారు రుణాలను ఇవ్వడంలో ఆర్థిక సంస్థలు పెద్దగా నిబంధనలను పాటించడం లేదు. ఇలాంటి వాటిని అరి కట్టాలి. ఇక ఆర్బీఐ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా ట్యాక్స్ టాక్స్ పేమెంట్లపై యూపీఐ లిమిట్‌ను పెంచుతూ నిర్ణయం తీసున్నారు. గతంలో రూ.లక్ష రూపాయలు ఉండే యూపీఐ లిమిట్‌ను రూ.5లక్షలకు పెంచినట్టు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. అంటే ఇప్పుడు యూపీఐ ద్వారా ఒకేసారి రూ.లక్ష వరకూ చెల్లించవచ్చు. కేవలం కొద్ది గంటల్లోనే చెక్ క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ గవర్నర్ ప్రతిపాదించారు. పాత ఇంటి రుణంపై అదనపు రుణం తీసుకుంటున్న తీరుపై శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై ట్యాక్స్ చెల్లించేవారు రూ.5 లక్షల వరకూ ఎలాంటి ఇబ్బందీ లేకుండా యూపీఐతోనే చేయవచ్చు. దీనికి ఎలాంటి అదనపు చార్జీలు వేయరు. చెల్లింపులు డెబిట్ లేదంటే క్రెడిట్ కార్డులతో చేస్తే మాత్రం కొంత చార్జీలు పడతాయి. ఆర్బీఐ ఇలా చార్జీలు పెంచడమనేది కొత్తేమీ కాదు.. గతంలోనూ పలు మార్లు పెంచింది. అంతకుముందు 2023 డిసెంబర్‌లోనే హాస్పిటల్, ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ వంటి వాటికి చేసే యూపీఐ పేమెంట్ లిమిట్‌ను ఆర్బీఐ రూ.5లక్షలకు పెంచింది. ప్రస్తుతం పన్ను చెల్లింపుల పరిమితిని కూడా పెంచేసింది. సాధారణ యూపీఐ ట్రాన్సాక్షన్ లిమిట్ విషయంలో మాత్రం మార్పేమీ చేయలేదు. గరిష్టంగా రూ.లక్ష మాత్రమే ఉంది.

# అమెరికాలో పెట్టుబడుల వేట

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 08:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన పెట్టుబడులన్నీ బోగస్ అంటూ ప్రచారం జరగడాన్ని ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తీవ్రంగా ఖండించారు. మొన్న, నిన్న చేసిన కొన్ని పెట్టుబడుల ప్రకటనలు బోగస్ అని వార్తలు వెల్లువెత్తిన నేపథ్యంలో జయేశ్ రంజన్ వీడియో ద్వారా వివరణ ఇచ్చారు. తెలంగాణకు పెట్టుబడులన్నీ వాస్తవమే అని స్పష్టం చేశారు. పెట్టుబడుల కోసం అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి అమెరికాలో చేస్తున్న మీటింగుల విశ్వసనీయత మీద తెలంగాణ ప్రజలకు ఎటువంటి అనుమానాలు అవసరం లేదని తెలిపారు. అన్ని విషయాలు చెక్ చేసిన తర్వాతే మీటింగ్‌లు చేస్తున్నామని జయేష్ రంజన్ వీడియోలో స్పష్టం చేశారు. ఫైనాన్షియల్ సర్వీసెస్లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో తమ సంస్థను నెలకొల్పేందుకు సిద్ధమైంది. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హోవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవెలప్?మెంట్? సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛాస్ స్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబా ద్‌కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది. మరో వైపు అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్.. ఆపిల్ సంస్థ హెడ్ క్వార్టర్ ఆపిల్ పార్క్ వెళ్లనున్నారు. ఆపిల్ మ్యానిఫాక్చర్ టీమ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ కానున్నారు. ట్రినేట్ కంపెనీ సీఈఓతో చర్చించనున్నారు. ఆరమ్ గ్రూప్ ఆఫ్ కంపెనీతో భేటీ అయి హైదారాబాద్‌లో ఆ కంపెనీ డేటా సెంటర్స్ విస్తరణ కోసం చర్చలు నిర్వహించనున్నారు. పలువురు టెక్ కంపెనీల ప్రతినిధులతో లంచ్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. అంగెన్ సంస్థ సీనియర్ లీడర్‌షిప్‌తో పెట్టుబడులపై చర్చలు నిర్వహించనున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాల సంస్థ రెనేశాస్ తో, మ్యానిఫాక్చర్ సంస్థ అమాట్‌తో ఇన్వెస్ట్‌మెంట్‌పై చర్చలు నిర్వహించనున్నారు. పలు బిజినెస్ సంస్థలతో రౌండ్ టేబుల్ సమావేశంలో రేవంత్ పాల్గొననున్నారు. అలాగే బుధవారం ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో చర్చలు సఫలం కానున్నాయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, స్కిల్ యూనివర్సిటీ, ప్రజారోగ్య రంగాల్లో సహకారం అందించడానికి ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీకి నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో 400 కోట్ల పెట్టుబడితో ఇన్జెక్టబుల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించేలా వివింట్ సంస్థ కృషి చేస్తామని తెలిపింది. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్ డెవలప్మెంట్ కోసం కార్నింగ్ కంపెనీ సహకరిస్తామని తెలిపింది. అంకాలజీ, క్రిటికల్ కేర్ విభాగంలో సహకారం కోసం కార్నింగ్ కంపెనీతో సర్కార్ ఎంఓయూ కుదుర్చుకుంది.








# ప్రభుత్వ విద్య బలోపేతానికి ప్రాధాన్యత

- మంత్రి సీతక్క
- విద్యార్థుల ఎదుగుదల టీచర్లతోనే సాధ్యం..
- నన్ను చూసి మా టీచర్లు సంతోష పడుతారు..

**హైదరాబాద్(నేటి ఫోకస్ న్యూస్ బ్యూరో) ఆగస్టు 08**



ప్రభుత్వం విద్య బలోపేతానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తు కార్యక్రమాలను అమలు చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గురువారం బాగ్ లింగంపల్లిలోని తెలంగాణ బాలోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్దబడుతుందన్నారు. అటువంటి ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కోవడం తక్కువగా భావించే పద్ధతి పోవాలని, ప్రభుత్వ పాఠశాల పిల్లలు ప్రతిభ గల పిడుగులున్నారన్నారు. ప్రభుత్వ విద్య పటిష్టతే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశామని, డీఎస్సీ పరీక్ష నిర్వహించామని, టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చామని తెలిపారు. 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో లోపాలుంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలుంటే పోరాడి సాధించుకోవాలని, టీచర్లు సైతం నిత్య విద్యార్థుల వలె అధ్యయనం చేయాలని, టీచర్లు వృత్తి ధర్మాన్ని పాటించాలన్నారు. తమ పిల్లలకు దీటుగా సర్కారీ బడి పిల్లలను తీర్చిదిద్దాలని కోరారు. నేనూ ప్రభుత్వ బడిలోనే చదువుకున్నానని, నన్ను చూసి మా టీచర్లు సంతోష పడతారన్నారు. విద్యార్థి ఎదుగుదల టీచర్లకే సాధ్యమని స్పష్టం చేశారు. డ్రగ్స్ కు విద్యార్థులు దూరంగా ఉండాలని, రిచ్ కల్చర్ పేరుతో తప్పుడు మార్గాలు పట్టొద్దని, సమాజం కోసం పరితపించే గుణాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకం నిలబెట్టుకునేలాగా విద్యార్థులు కష్టపడాలన్నారు. క్షణిక ఆనందం కోసం జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. అనంతరం డ్రగ్స్ మహమ్మారిని అంతం చేస్తామని విద్యార్థుల చేత మంత్రి సీతక్క ప్రతిజ్ఞ చేయించారు.



## వేతనాలు చెల్లించాలి

- 'ఒక్క రోజు సమ్మె' కార్యక్రమం నిర్వహించిన గ్రామ పంచాయతీ సిబ్బంది..

**దేవరుప్పుల ఫోకస న్యూస్ ప్రతినిధి సైదులు ఆగస్టు 08**

మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 'ఒక్క రోజు సమ్మె' కార్యక్రమాన్ని సీఐటీయూ దేవరుప్పుల మండల అధ్యక్షుడు బస్వ రామ్ చంద్రు ఆద్వర్యంలో గ్రామాలలో సఫాయి పనులను బంద్ చేసి ధర్నా చేసిన గ్రామపంచాయతీ కార్మికులు,సిబ్బంది.లి ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది పర్మినెంట్,వేతనాలు పెంపుపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని,పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలని,మల్టి పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని,వేతనాలకు ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలని,కారోబార్ లను,బిల్ కలెక్టర్ లను సహాయ కార్యదర్శిలుగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎడవెల్లి వెంకట్ రెడ్డి, గొడిశాల సోమయ్య, బాణోతు సైదులు,గణగాని ఉప్పలయ్య, రామ్ చందర్, దయాకర్, శంకర్, లక్ష్మీ పాల్గొన్నారు.




## రూ.11,000 ఆర్థిక సహాయం అందించిన పెద్దవంగర లయన్స్ క్లబ్

**పెద్దవంగర ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు ఆగస్టు 08**

రాంపాక రాజు సుదర్శన్ పెద్ద వంగర వాస్తవ్యులు డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థికి ఆర్థిక సహాయం అందించిన పెద్ద వంగర లైన్స్ క్లబ్ అధ్యక్షులు ఏదునూరి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రేణుక కోశాధికారి రాపోలు శ్రీనివాస్ పెద్ద వంగర మండలంలోని పెద్దవంగరకి చెందిన రాంపాక రాజు డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థికి 10 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో యాక్సిడెంట్ జరిగినది యాక్సిడెంట్ హనుమకొండలోని ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స జరుగుతున్న సందర్భంగా వారి కుటుంబం ఆర్థికంగా ఆదుకోవడానికి పెద్ద వంగర లైన్స్ క్లబ్ వారు 11 వేల రూపాయలను ఆర్థిక సాయం అందించి ప్రపంచంలోనే కేరళ రాష్ట్రంలో వరద బాధితులకు ఐదు కోట్ల రూపాయలను లైన్స్ క్లబ్ వారు దాతృత్వం అందజేసినారు పెద్ద వంగర లైన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటుంది అన్న విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తూ మండలంలో నిరుపేదలు ఎవరైనా కడు బీద కుటుంబంలో ఉంటే వారికి ఏదైనా సహాయం చేయడానికి క్లబ్ ముందుంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో మెంబర్షిప్ చైర్మన్ జలగం సతీష్ అన్నపురం రవి ఎర్ర వెంకన్న మల్లికార్జున చారి ఎడవెల్లి మధుసూదన్ రెడ్డి మంజుల రాంపాక కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




## వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్‌న్యూస్:** వీధి కుక్కల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం వనపర్తి పట్టణంలోని నాగవరం శివారు ఉరగుట్ట వద్ద కొత్తగా నిర్మితమైన జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్‌తో కలిసి పరిశీలించారు. జిల్లాలో వీధి కుక్కల సంతతిని తగ్గించడానికి రోజుకు కనీసం 10 కుక్కలకు జనన నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని నలు మూలల నుండి వీధి కుక్కలను తీసుకు వచ్చి సురక్షితమైన పద్ధతిలో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఎనిమల్ వెల్ఫేర్ కేర్ సెంటర్ ఏజెన్సీతో ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు, సిబ్బందిని సమకూర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారికి సూచించారు. శస్త్ర చికిత్స అనంతరం వారం రోజులు అక్కడే వాటి ఆరోగ్య సంరక్షణ చేసేవిధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. శస్త్ర చికిత్సలు ఈ రోజు నుండి ప్రారంభించాలని సూచించారు. డంపింగ్ యార్డులో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్ ను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్ ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ప్లాస్టిక్ ను అమ్మేయడంతో పాటు తడి చెత్త నుండి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. మున్సిపాలిటీ నుండి రోజుకు ఉత్పత్తి అయ్యే చెత్త ఎంత, ఎన్ని క్వింటాళ్ల చెత్తను సేకరిస్తున్నారనే పూర్తి వివరాలు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా బయో మైనింగ్ ను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పి సీఈవో యాదయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## సమస్య ఏదైనా పరిష్కారమే మా లక్ష్యం

- కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడు జన్యావుల రామకృష్ణ

**ఫోకస్ న్యూస్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఆగస్ట్ 08:**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ లో నెలకొన్న ఏ సమస్యనైనా పరిష్కరిస్తామని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ జన్యావుల రామకృష్ణ అన్నారు. గురువారం 7వ వార్డులోని చిన్నక మేల, టీచర్స్ కాలనీలలో పర్యటించిన రామకృష్ణ, స్థానికులతో మాట్లాడారు. అక్కడి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కారం కోసం పని చేస్తున్నామని, అభివృద్ధి నిధులకోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఇప్పటికే విన్నవించామని పేర్కొన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులతో పాటు ఇంకా అధికంగా నిధులు కేటాయించాలని అధికారులను, సంబంధిత మంత్రులను కలిసి విన్నవించానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధుల విషయంలో అన్ని నియోజక వర్గాల మాదిరిగానే న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రశాంత్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.






## డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దాం

- విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు
- డ్రగ్స్ మత్తు పదార్థాలు ప్రమాదకరం: ఏసిపి గోపాలకృష్ణమూర్తి
- బోయిన్‌పల్లి ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఆగస్ట్ 08:** విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా అనుమానితులు ఉంటే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి తెలిపారు. గురువారం బోయిన్ పల్లి బాపూజీ నగర్ కైట్ జూనియర్ కళాశాలలో బోయిన్ పల్లి ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో డ్రగ్స్, సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ... సమాజంలో యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని, ఇటువంటి కార్యక్రమాలు యువ విద్యార్థులు ఉంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు సంబంధించి అవగాహన కల్పించడం, సానుకూల ప్రవర్తనను ప్రోత్సహించడం, సురక్షిత ఆన్లైన్ వినియోగం మరియు మదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడి భవిష్యత్తు నాశనం చేసుకుంటున్న యువతకు మనందరం కలిసి అవగాహన కల్పించాలని విద్యార్థులకు తెలిపారు. ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ... డ్రస్సు మత్తు పదార్థ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కైట్ జూనియర్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అత్యాచార నిందితుడికి 10ఏళ్ల జైలు శిక్ష, లక్ష జరిమానా

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**



అత్యాచార నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. ఆర్. సునీత సంచలన తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన పెద్ది లక్ష్మీ అనే అమ్మాయిని అదే గ్రామానికి చెందిన చింతకాయల లక్ష్మీనారాయణ అనే యువకుడు ప్రేమ పేరుతో పెళ్లి శారీరక సంబంధం ఏర్పరచుకొని కోరిక తీరిన తర్వాత పెళ్లికి ఒప్పుకోకపోవడంతో బాధితురాలు కొత్తకోట పోలీసు స్టేషన్లో 2018 లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్సై రవికాంతరావు కేసు నమోదు చేసి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేయగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.గోపాల్ రెడ్డి కోర్టులో 14 మంది సాక్షులను ప్రవేశపెట్టి గట్టి వాదనలు వినిపించారని ఆయన తెలిపారు. నాటి ఎస్ఐ తో పాటు సిఐలు ప్రస్తుత ఎస్సై, సీఐ, లైజనింగ్ అధికారి, కోర్టు కానిస్టేబుల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ల చొరవతో నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధించగా బాధితురాలికి ప్రభుత్వం నుంచి 90000 అందజేయాలని తీర్పులో వెలువరించినట్లు ఆయన తెలిపారు. అత్యాచార కేసులో ఇన్వెస్టిగేషన్ చేసి నేరస్తులకు శిక్ష పడడంలో కృషిచేసిన అధికారులకు త్వరలోనే రివార్డులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే అమ్మాయిలను, మహిళలను వేధించి ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసే వారిపై జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎవరైనా తప్పుడు పనులు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆర్టీసీ ప్రయాణికులకు శ్రావణమాస బంపర్ ఆఫర్

- డిపో మేనేజర్ వేణుగోపాల్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శుభ కార్యక్రమాలకు వెళ్లే ప్రయాణికులకు 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివాహాది శుభకార్యాలు, ఫంక్షన్లు, విహార యాత్రలకు వెళ్లే ప్రయాణికులకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను అతి తక్కువ ధరకే అద్దెకు ఇస్తామని తెలిపారు. ఆర్టీసీలో ప్రయాణించే వారికి సురక్షిత, సుఖవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.



## తిరుపతి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆదిత్య రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు (అన్న) కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కుమారుడు ఏఐపిసి మెడికల్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్య రెడ్డి హాజరై ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## తిరుపతి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బి.కృష్ణ

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ మేరకు వనపర్తికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు బి. కృష్ణ ఆధ్వర్యంలో ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పరశురాం, కుమార్ పాల్గొన్నారు.



## పానగల్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

జిల్లా క్రైమ్ బ్రాంచ్ లో విధులు నిర్వహించే ఎస్సై శ్రీనివాసులు బదిలీపై పానగల్ ఎస్సైగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ను ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూ ర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఎస్ఐ శ్రీనివా సులు గతంలో నాగర్ కర్నూల్ జిల్లాలోని తిమ్మాజీపేట, లింగాల మండలాల్లో విధులు నిర్వహించి అక్కడి ప్రజలతో మంచి పోలీసు అధికారిగా పేరుపొందారు. అనంతరం వనపర్తి జిల్లాకు బదిలీపై వచ్చి కొంతకాలం జిల్లా క్రైమ్ బ్రాంచ్ లో ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయనకు పానగల్ ఎస్సైగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ బదిలీ చేశారు.



## జీపీ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలి

- ఒక్కరోజు గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె
- స్థానిక ఎంపీడీవో ఆఫీస్ దగ్గర ధర్నా

**సదాసిపేట్ (రూలర్) ఫోకస్ న్యూస్ ప్రతినిధి-ఆగస్టు 8:**

సదాశివపేట గ్రామపంచాయతీ ఉద్యోగుల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 21 వేల రూపాయలు ఇవ్వాలని, సిబ్బందిని తక్షణమే పర్మినెంట్ చేయాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈరోజు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా (ఒక్కరోజు సఫాయి బంద్) ఒక్కరోజు సమ్మె సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచుతానని సిబ్బందిని పర్మినెంట్ చేస్తా అని హామీ ఇచ్చిన అమలు జరపడం లేదు. అనేక గ్రామాలలో జీతాలు కూడా పెండింగ్లో ఉన్నాయన్నారు, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 21000 ఇవ్వాలని గ్రామపంచాయతీ సిబ్బందిని తక్షణమే పర్మినెంట్ చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు శేఖర్, సంజీవులు, నగేష్ ఆనందం, మహేష్, రామచందర్ మైపాల్ పోచయ్య యాదమ్మ సుమలత పాల్గొన్నారు.

## ప్రపంచ జ్ఞానాన్ని అందించే నేస్తం 'పుస్తకం'

- పలుస శంకర్ గౌడ్ జిల్లా అధ్యక్షులు సాహితీ కళా వేదిక

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** ప్రపంచ జ్ఞానాన్ని అందించే ఉత్తమ నేస్తం పుస్తకం అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో గురువారం పుస్తక సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ పుస్తకాలు మానవ జీవితానికి చక్కటి దిశా నిర్దేశం చేసే మార్గదర్శిగా ఆయన వివరించారు.విలువలతో కూడిన పుస్తకాలు ప్రజలకు అందుబాటులోకి రావాల్సిని అవసరం చాలా ఉందని అందుకే నిరుపయోగంగా ఇళ్లలో ఉంచుకున్న అలాంటి గ్రంథాలను తాము సేకరించి ప్రజకు చేరువ చేస్తున్నామని శంకర్ గౌడ్ తెలిపారు.పట్టణంలోని కేడీఆర్ నగర్ కు చెందిన సత్య నారాయణ గౌడ్ తనతో ఉన్న దాదాపు రెండు వందల గ్రంథాలను కళా వేదిక సభ్యులకు అందజేశారు. ఈనాటి కార్యక్రమంలో సాహితీ కళా వేదిక ప్రతినిధులు సూర చంద్ర శేఖర్,డి.రాములు, బైరోజు చంద్ర శేఖర్,బండారు శ్రీనివాస్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

# వయనాడ్ బాధితులకు ప్రభాస్ అండ

## 2కోట్ల విరాళం ప్రకటించినట్లు టీమ్ ప్రకటన

### కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందించడానికి నటుడు

ప్రభాస్ ఎప్పుడూ ముందుంటారు. తాజాగా ఆయన మరో సారి తన గొప్ప మనసును చాటుకున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో చోటుచేసుకున్న విషాదాన్ని దృష్టిలో ఉంచుకుని భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు ప్రభాస్ రూ.2కోట్లు విరాళం ఇస్తున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. దీనిపై సినీ ప్రియులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. టాలీవుడ్ నుంచి అంత మొత్తంలో విరాళాన్ని చెల్లించిన హీరో ఆయనే కావడం విశేషమని నెటిజన్లు అనుకుంటున్నారు. ఆయన గొప్ప మనసుని మెచ్చుకుంటున్నారు. వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అందరినీ కలచివేస్తోంది. సహాయక చర్యల కోసం పలువురు సినీతారలు ముందుకొచ్చి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఆ విషాద ఘటనపై స్పం దించిన చిరంజీవి, రామ్‌చరణ్ రూ.కోటి విరాళంగా ప్రకటిం చారు. అల్లు అర్జున్ రూ.25లక్షలు కేరళ సీఎం సహాయ నిధికి అందిస్తున్నట్లు తెలిపారు. హీరో సూర్య, ఆయన భార్య జ్యోతిక, సోదరుడు కార్తి సంయుక్తంగా రూ.50 లక్షలు, నయనతార-విఘ్నేశ్ శివన్ దంపతులు రూ.20 లక్షలు మలయాళ నటులు మమ్ముట్టి, దుల్కర్ సల్మాన్ కలిపి రూ.35 లక్షలు, ఫహాద్ ఫాజిల్ రూ.25 లక్షలు, కమల్ హాసన్ రూ.25 లక్షలు, విక్రమ్ రూ.20 లక్షలు, రష్మిక రూ.10 లక్షల విరాళం ప్రకటిం... ...పైవు నటుడు మోహన్‌లాల్ స్వం... ...యిక






# ఆనందోబ్రహ్మకు సీక్వెల్

తెలుగు సినీ పరిశ్రమలో ఇప్పుడు సీక్వెల్స్‌కు, ఫ్రాంఛైజీలకు మంచి సీజన్ నడుస్తోంది. ప్రస్తుతం తెలుగులో పలు సీక్వెల్స్ సెట్స్ మీద వున్నాయి. ఇందులో ఈ భాగంగానే తాప్సీ కథానాయికగా నటించిన విజయవంతమైన హారర్ కామెడీ థ్రిల్లర్ ఆనందో బ్రహ్మకు సీక్వెల్ రాబోతుంది. ఇంతకు ముందు ఆనందో బ్రహ్మ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శక నిర్మాత మహి.వి.రాఘవ ఈ సీక్వెల్‌ను రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నాడు.ప్రస్తుతం ఆనందో బ్రహ్మకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ మొదలయ్యాయి. అయితే ఈ చిత్రం మొదటిభాగంలో నటించిన కథానాయిక తాప్సీని ఒప్పించే పనిలో వున్నాడు మహి. ఈ సీక్వెల్ కోసం ఆమెను సంప్రదించి ఒప్పించినట్లు తెలిసింది. అంతేకాదు ఈ సినిమలో ఓ యంగ్‌హీరో కూడా ముఖ్యపాత్రలో కనిపించబోతున్నాడు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని చేయాలనే ఆలోచనలో వున్నారు దర్శక నిర్మాతలు. ఆనందో బ్రహ్మను తమిళంలో పెట్రోమాక్స్‌గా రిమేక్ చేయగా.. ఇందులో తమన్నా కథానాయికగా నటించింది.

# నాగచైతన్య, శోభితాధూళిపాళ్ల నిశ్చితార్థం..

టాలీవుడ్ హీరో నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలను నటుడు నాగార్జున సోషల్ మీడియాలో పంచుకున్నారు. నా తనయుడు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం ఈ రోజు ఉదయం 9.42 గంటలకు జరిగింది. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం సంతోషంగా ఉంది. మా కుటుంబంలోకి ఆమెను సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. నూతన జంటకు నా అభినందనలు. వీరి జీవితం సంతోషం, ప్రేమతో నిండాలని కోరుకుంటున్నా 8.8.8 అనంతమైన ప్రేమకు నాంది అని నాగార్జున పేర్కొన్నారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందించారు. కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. నాగచైతన్యకు గతంలో నటి సమంతతో పెళ్లయ్యాక కొంతకాలానికి వ్యక్తిగత కారణాల వల్ల వారిద్దరూ విడిపోయారు. చై-శోభిత ఎంతోకాలం నుంచి స్నేహితులుగా ఉన్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. శోభిత ధూళిపాళ్ల 2013లో ఫెమినా మిస్ ఇండియా టైటిల్ విన్నర్‌గా నిలిచారు. 2016లో సినీ రంగంలోకి ప్రవేశించారు. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు. నాగచైతన్య తండేల్'తో బిజీగా ఉన్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో ఇది రూపొందుతోంది.



# రామ్‌చరణ్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్

### గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్

కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్' మూవీ మీద ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే వదిలిన పోస్టర్స్, 'జరగండి జరగండి..' సాంగ్ మినహా సరైన అప్డేట్ మాత్రం ఇప్పటి వరకు మేకర్స్ నుంచి రాలేదనే చెప్పుకోవాలి. ఈ విషయంలో నిరాశలో ఉన్న ఫ్యాన్స్‌కు.. ఇకపై అప్డేట్స్ బీభత్సంగా ఉంటాయనేలా హింట్ వచ్చేసింది. అవును.. ఈ సినిమాకు సంబంధించి తాజాగా మేకర్స్ ఓ అధికారిక అప్డేట్‌ను ఇచ్చారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముగించుకుని డబ్బింగ్ కార్యక్రమాలను జరుపుకుంటున్నట్లుగా.. అందుకు సంబంధించిన ఫొటోలతో మేకర్స్ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ అధికారిక ప్రకటనను విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకు ఫ్యాన్స్‌కు ఉన్న అనుమానాలు తొలగినట్లయింది. ఇంత వరకు సినిమా షూటింగ్ ఏ స్టేజ్‌లో ఉందో తెలియందు. డిసెంబర్ రిలీజ్ అంటున్నారా? డిసెంబర్‌కి నిజంగా 'గేమ్ చేంజర్' విడుదల ఉంటుందా? అనే మెగాభిమానులకు ఈ అప్డేట్ కాస్త క్లారిటీని ఇచ్చినట్లయింది. దీంతో.. 'గేమ్ చేంజర్' ట్యాగ్‌ని వారు వైరల్ చేస్తూ.. ట్రెండింగ్‌లోకి తీసుకొచ్చారు.విలక్షణ నటుడు ఎస్.జె. సూర్య కూడా ట్విట్టర్ వేదికగా ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు యమా జోరుగా జరుగుతున్నట్లుగా వెల్లడించారు. రీసెంట్‌గా హీరోయిన్ కియారా అద్వానీ పుట్టినరోజును పురస్కరించుకుని 'గేమ్ ఛేంజర్' నుంచి ఆమె లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. చూపు తిప్పుకోవటం కష్టం అనేంత బ్యూటీగా కియారా ఈ లుక్‌లో కట్టి పడేసింది. ఇక లార్జర్ దేన్ లైఫ్ చిత్రాలను అబ్బురపరిచే రీతిలో తెరకెక్కించే శంకర్ ఇప్పటి వరకు తెరకెక్కించిన సినిమాలను మించేలా 'గేమ్ ఛేంజర్'ను రూపొందిస్తున్నట్లుగా మేకర్స్ చెబుతున్నారు. 'గేమ్ చేంజర్' సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీత సారథ్యం వహిస్తున్నారు. ప్రముఖ ఆడియో కంపెనీ సారేగమ ఈ సినిమా ఆడియో రైట్స్‌ను ఫ్యాన్సీ రేటుకు దక్కించుకుంది. క్రిస్మస్ సందర్భంగా ఈ పాన్ ఇండియా చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



